క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీలైన్ షిఫ్ట్, రోడ్డు విస్తరణ జరుగుతున్న ప్రాంతాలైన మిర్యాలగూడ రోడ్, బీటీఎస్, శ్యామసానగర్, భారత్ గ్యాస్ ఏరియా, దారుపాష కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయా కాలనీల ప్రజలు సహకరించాలని కోరారు.

రేషన్ కార్డుల పంపిణీ

శాలిగౌరారం: ప్రభుత్వం మంజూరు చేసిన నూతన రేషన్‌కార్డులను సోమవారం అంబారిపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ అంబారిపేట గ్రామశాఖ అధ్యక్షుడు చిరబోయిన లింగస్వామి, గుత్తా రవీందర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మొలుగూరి నాగయ్య, రవీందర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాసరెడ్డి, సైదులు, జాని, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ బాక్స్ అందజేత



సౌండ్ బాక్స్ అందజేస్తున్న దాతలు

నార్కట్‌పల్లి: చెర్వుగట్టు ప్రాథమిక పాఠశాలకు చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, దాసోజు శంకరాచారి బహూకరించిన సౌండ్ బాక్స్‌ను సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

13 వరకు రైతు బీమాకు దరఖాస్తుల స్వీకరణ

మునుగోడు: ప్రభుత్వం 59 ఏళ్ల లోపు రైతులకు అందిస్తున్న రైతు బీమాకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని పులిపలుపుల ఏఈఓ ఎం.నర్సింహ కోరారు. సోమవారం ఆయన పులిపలుపుల క్లస్టర్ కార్యాలయంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ లోపు 18 ఏండ్ల నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన రైతులు తమ పట్టా పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డులను జతచేసి ఏఈఓ కార్యాలయంలో దరఖాస్తు అందించాలన్నారు.

నార్కట్‌పల్లి: రైతు బీమా కోసం ఈ నెల 13వ తేదీ వరకు నార్కట్‌పల్లి రైతు వేదికలో రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గౌతం, ఏఈఓ నవీన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డ్ జిరాక్స్‌లతో స్వయంగా వచ్చి దరఖాస్తులు అందజేయాలన్నారు.


నాంపల్లి: రైతు బీమాకు ఈ నెల 13వ తేదీ ఆఖరి తేదీ అని మండల వ్యవసాయ శాఖ అధికారి శివ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5వ తేదీ వరకు పట్టాదారు పాస్ పుస్తకం తీసుకున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, రైతు బ్యాంకు అకౌంటు, దరఖాస్తు ఫారంతో జత చేసి సంబంధిత రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలన్నారు.

శాలిగౌరారం: నూతనంగా వ్యవసాయ భూమి పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు రైతుబీమా పథకం కోసం ఈ నెల 13 లోగా దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి కోరారు. శాలిగౌరారం మండలకేంద్రంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధారకార్డుల జిరాక్స్‌లను జత చేసి మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామం ప్రభుత్వ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో రాత్రి వాచ్‌మెన్ కమ్ స్వీపర్ ఉద్యోగానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఈఓ సైదులు తెలిపారు. దరఖాస్తుదారులు 10వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈ నెల 13, 14 తేదీల్లో మోడల్ స్కూల్‌లోని బాలికల వసతి గృహంలో విద్యార్థుల కేర్‌టేకర్‌కు అందజేయాలన్నారు.

రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో పతకాలు



సర్టిఫికెట్లు అందుకుంటున్న యోగాసాధకులు

నల్లగొండ: ఆదిలాబాద్‌లో ఈ నెల 7,8 తేదీల్లో నిర్వహించిన 6వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు పతకాలు సాధించారు. శివమణి బ్రోంజ్ మెడల్, సీనియర్ మహిళా విభాగంలో శివాని సిల్వర్ మెడల్, ప్రతిష్ఠ బ్రోంజ్ మెడల్స్ సాధించారు. విజేతలను నల్లగొండ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోట సింహాద్రి, జనరల్ సెక్రటరీ రాయనబోయిన శ్రీను అభినందించారు.

కాజ్‌వేలు ఇలా.. ప్రయాణించేదెలా!



శాలిగౌరారం-మాధారంకలాన్ రోడ్డుపై ఊట్కూరు సమీపంలో కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద (ఫైల్)



ఊట్కూరు - బండమీదిగూడెం కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద (ఫైల్)

- వర్షాకాలంలో కాజ్‌వేల పైనుంచి వరద ప్రవాహం
- వాహనదారుల రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- బ్రిడ్జీలు నిర్మించాలని ప్రజల వేడుకోలు

శాలిగౌరారం: పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల పరిధిలో ఉన్న శాలిగౌరారం మండలంలోని ప్రధాన రోడ్లపై ఉన్న కాజ్‌వేలు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. నాడు రోడ్ల నిర్మాణాల సమయంలో పరిస్థితులకు అనుగుణంగా రోడ్లపై లోతట్టు ప్రాంతాల్లో కాజ్‌వేలను నిర్మించారు. ప్రస్తుతం నీటి వనరులు పెరిగి పంట పొలాల్లోని నీరు కాజ్‌వేల మీదుగా ప్రవహిస్తుండడంతో కాజ్‌వేలు ప్రమాదకరంగా మారాయి. కాజ్‌వేలపై నాచు పేరుకుపోయి ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు. వాహనాల రాకపోకలు పెరగడంతో కాజ్‌వేలు ధ్వంసమయ్యాయి. సెప్టెంబర్ 2016లో శాలిగౌరారం-ఆకారం రోడ్డులో గండికుంట దగ్గర ఉన్న కాజ్‌వే వద్ద సూర్యాపేటకు చెందిన ఓ వ్యక్తి వరదనీటిలో కొట్టుకుపోయి మృతిచెందాడు. అదే విధంగా తుడిమిడి-చిత్తలూరు రోడ్డుపై ఉన్న ఓ కాజ్‌వే వద్ద కొడుకుతో ద్విచక్ర వాహనంపై వెళుతూ కాజ్‌వేపై గుంతలో పడి అదుపుతప్పి కిందపడడంతో అతడి తల్లి మృతి చెందారు.

వర్షాకాలంలో మరింత ప్రమాదకరం

సాధారణ సమయాల్లోనే కాజ్‌వేలపై ప్రమాదాలు జరుగుతున్నాయంటే ఇక వర్షాకాలంలో అయితే ఆ పరిస్థితి మరింత అధికంగా ఉంటోంది. వర్షాకాలంలో సుమారు రెండు నెలలపాటు కాజ్‌వేలపై వరద నీటి ప్రవాహాలు కొనసాగుతూనే ఉంటాయి. వర్షాలు అధికంగా కురిసిన సమయంలో కాజ్‌వేలు కనిపించని స్థాయిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ సమయంలో వరదనీటి ప్రవాహాలను అంచనా వేయకుండా కాజ్‌వేలపై నుంచి ప్రయాణిస్తూ అనేక మంది వాహనదారులు, పాదచారులు వరదనీటిలో కొట్టుకుపోయిన దాఖలాలు అనేకంగా ఉన్నాయి. శాలిగౌరారం మండలంలో శాలిగౌరారం-మాధారంకలాన్ ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఊట్కూరు సమీపంలో ఉన్న కాజ్‌వే, ఊట్కూరు-బండమీదిగూడెం పంచాయతీరాజ్ రోడ్డుపై ఉన్న కాజ్‌వేలు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. వర్షాలు అధికంగా కురిసిన సమయంలోనే కాక అడ్లూరు పెద్దచెరువు అలుగు పోస్తే ఆ వరదనీరు ఆయా కాజ్‌వేల పైనుంచి నెలల తరబడి ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. నాలుగు రోజుల క్రితం శాలిగౌరారం మండలంలో కురిసిన అతి భారీ వర్షానికి ఊట్కూరు, బండమీదిగూడెం కల్వర్టుల పైనుంచి నేటికీ వరదనీటి ప్రవాహాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని కాజ్‌వేల స్థానంలో హైలెవెల్ బ్రిడ్జీలు నిర్మించి ప్రమాదాలను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జీలు నిర్మించాలి



మా గ్రామానికి ఊట్కూరు నుంచి ఉన్న ఏకైక రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షానికి పూర్తిగా ధ్వంసమైంది. ప్రజలు కాలినడకన కూడా ప్రయాణించేందుకు వీల్లేకుండా రోడ్డు మొత్తం రాళ్లు తేలాయి. దీనికితోడు రోడ్డుపై ఉన్న కాజ్‌వే పైనుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు కొనసాగించలేకపోతున్నాం. కాజ్‌వే వద్ద హైలెవెల్ బ్రిడ్జి నిర్మించి మాకు మేలు చేయాలి.

– సురేందర్, బండమీదిగూడెం గ్రామం, శాలిగౌరారం మండలం

ప్రతిపాదనలు పంపించాం



ఊట్కూరు-బండమీదిగూడెం రోడ్డును అభివృద్ధి పరచడంతోపాటూ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న కాజ్‌వే వద్ద హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదికలు అందించాం. ప్రభుత్వం నిధుల మంజూరు చేస్తే వెంటనే టెండర్ ప్రక్రియ మొదలు పెడతాం. టెండర్ ఖరారు కాగానే నిర్మాణ పనులు చేపట్టి వేగవంతంగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– భరత్‌చంద్ర, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ, శాలిగౌరారం మండలం

రిజర్వేషన్లు అడ్డుకుంటే బీజేపీకి గుణపాఠం తప్పదు

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



మునుగోడు: చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ సత్యం

మునుగోడు: బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేస్తే.. వాటిని అడ్డుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని, రిజర్వేషన్లను అడ్డుకుంటే బీజేపీకి రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మునుగోడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం మునుగోడులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కుట్రల కారణంగా బీసీలు రాజకీయంగా, ఉద్యోగాల పరంగా వెనకబాటుకు గురవుతున్నారని అన్నారు. ముస్లింల పేరుతో బీజేపీ నాయకులు బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా అందరికీ వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్జ రామచంద్రం, బండారు శంకర్, భీమనపల్లి రమేష్, బి.లాలు, దయాకర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి

మర్రిగూడ : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రంలోని బీజేపీ అడ్డుకోవడం సరికాదని, వెంటనే పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుకాకుండా రాష్ట్రంలోని బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గ్రామాల్లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కన్వీనర్ బుర్ర శేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఈదుల భిక్షంరెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎరుకుల నిరంజన్, ఆకుల రఘుమయ్య, జక్కల అంజయ్య, లపంగి రవి, మాదగోని నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



ఊకొండిలో ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందిస్తోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మండల కేంద్రాల్లో వైద్యసేవలు అందేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రామస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తోందన్నారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్య అభ్యసించేందుకు మండలానికి రెండు, మూడు గురుకుల పాఠశాలల ఏర్పాటుతోపాటు నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మిస్తోందన్నారు. కార్యక్రమంలో చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, ఎంపీడీఓ ఈ.విజయభాస్కర్, మండల వైద్యాధికారి నర్మద, ఏఈ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, పంచాయతీ కార్యదర్శి గీతా, వట్టికోటి శేఖర్, పాల్వాయి చెన్నారెడ్డి, బూడిద లింగయ్య యాదవ్, నడిపల్లి యాదగిరి, మిర్యాల వెంకన్న, మాదగోని దేవలోకం, మేడి యాదయ్య, నిమ్మల స్వామి, యాదయ్య, శంకరయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా విద్యాలయం తనిఖీ చేసిన ఎమ్మెల్యే



సిబ్బందికి సూచనలు ఇస్తున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు : పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డార్మిటరీ హాల్స్, వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. స్వయంగా వంటల రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. తరగతులు, భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వేడి నీటి సదుపాయం, పడుకోవడానికి బెడ్స్, బ్లాంకెట్స్, ఆట స్థలం, బాత్రూమ్స్, టాయిలెట్స్ తదితర సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి విద్యార్థులు తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేకాధికారి మంజులకు ఫోన్ చేసి ఉన్న విద్యార్థుల సంఖ్యకు చేసిన వంటలకు పొంతన లేదని, ఎందుకు తక్కువ చేయాల్సి వచ్చిందని, విధుల్లో ఎందుకు లేరని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరిపడా ఆహారం ఎందుకు చేయడం లేదని మందలించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల కో ఆర్డినేటర్ గంట సత్యం ముదిరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్, కోడి గిరిబాబు, కోడి శ్రీనివాసులు, కల్లెట్ల మారయ్య, దశరథ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై చట్టం చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై పార్లమెంట్లో చట్టం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ ద్వంద వైఖరి మానుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా వెళ్లకుండా ప్రతిపక్ష పార్టీలతో కలిసి పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, గాదె నరసింహ, దండెంపల్లి సరోజ, అవుట రవీందర్, నాగరాజు, విష్ణుమూర్తి, లక్ష్మణ్, లక్ష్మీపతి, దూదిమెట్ల వెంకన్న, నరసింహ పాల్గొన్నారు.

నేడు యాదవ కలశ యాత్ర

కేతేపల్లి: అఖిల భారత యాదవ మహాసభ నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 12న కేతేపల్లికి చేరుకోనున్న రేజంగ్ల రజ్ కలశ యాత్రను జయప్రదం చేయాలని కేతేపల్లి మాజీ ఎంపీపీ బడుగుల శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. యాదవ సంఘం ప్రతినిధులతో కలసి సోమవారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చైనాతో జరిగిన యుద్ధంలో 120 మంది యాదవ సోదరులు వీరమరణం పొందారని, వారి జ్ఞాపకార్థం యాదవ రెజిమెంట్ ఏర్పాటు చేయాలని కోరుతూ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ జటంగి లక్ష్మమ్మ, నాయకులు జటంగి వెంకటనర్సయ్య యాదవ్, ఎ.వెంకన్న, జటంగి సైదులు, జటంగి ముత్తమ్మ, డి.ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

కనగల్: అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న దేవరకొండ పట్టణం నుంచి గుర్రంపోడు, కనగల్ మీదుగా నల్లగొండ వరకు నిర్వహించే రెజంగ్లరజ్ కలశ యాత్ర ర్యాలీని విజయవంతం చేయాలని సంఘం మండల నాయకులు జెట్టి శ్యామ్‌సుందర్‌యాదవ్, మండలి పరమేష్ యాదవ్ ఒక ప్రకటనలో కోరారు. 12న మధ్యాహ్నం 2 గంటలకు కలశ యాత్ర కనగల్‌కు చేరుకుంటుందని తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టండి

చిట్యాల: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా పంచాయతీ కార్యదర్శులు ముందస్తుగా తగిన పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని చిట్యాల మండల ప్రత్యేకాధికారి పి.శ్రావణ్‌కుమార్ సూచించారు. చిట్యాల ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయలక్ష్మీ, ఎంపీఓ సత్యనారాయణ, సీహెచ్‌ఎఓ నర్సింగ్‌రావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



మర్రిగూడ : విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశంగౌడ్

చిట్యాల: చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో 5225 మంది బాలబాలికలకు నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలను పంపిణీ చేసినట్లు చిట్యాల ఆస్పత్రి డాక్టర్ సత్య నరేష్ తెలిపారు. చిట్యాలలో జెడ్పీహెచ్‌ఎస్‌లో నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులి పురుగుల నివారణ మందులను బాలబాలికలు తప్పనిసరిగా వేసుకున్నట్లయితే శారీరక ఎదుగుదల ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పానుగోతు సైదానాయక్, సీహెచ్‌ఓ నర్సింగ్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ, ఏఎన్‌ఎంలు భాగ్యలక్ష్మీ, సరళ, హెచ్‌ఎంలు మాధవి, సత్తయ్య పాల్గొన్నారు.

మర్రిగూడ మండలంలో..

మర్రిగూడ : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం మర్రిగూడ మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణి చేశారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశంగౌడ్ విద్యార్థులకు మాత్రలను మిగించారు.

దివ్యాంగ కుటుంబానికి ఎంపీడీఓ చేయూత



బియ్యం, దుస్తులు అందజేస్తున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి

శాలిగౌరారం: మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో వృద్ధులు, మూగవారైన అక్కా తమ్ముడు జిల్లోజు పూలమ్మ, జిల్లోజు రాములుకు ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి సొంత ఖర్చులతో సోమవారం 25 కిలోల బియ్యంతోపాటూ నూతన దుస్తులు, పండ్లు అందజేశారు. పుట్టుకతో మూగవారైన అక్కా తమ్ముడికి సదరం సర్టిఫికెట్ లేకపోవడంతో ఆసరా పింఛన్ రాక పూట గడువలేని పరిస్థితిలో ఉన్నారు. వారి పరిస్థితిని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుల్తాన్ యల్లయ్య ఇటీవల ఎంపీడీఓ జ్యోతిలక్ష్మికి తెలియజేశారు. దీంతో ఎంపీడీఓ గ్రామానికి వెళ్లి వారి పరిస్థితి గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ వెంటనే మీసేవ నిర్వాహకులతో మాట్లాడి ఇంటివద్దనే యూడీఐడీ పోర్టల్‌లో వేలిముద్రలు నమోదు చేయాలని ఆదేశించారు. పూలమ్మ, రాములును సదరం క్యాంపునకు తీసుకెళ్లడంతో పాటూ పింఛన్ మంజూరు కోసం కృషిచేస్తానన్నారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ జంగమ్మ, ఈసీ వెంకటాచారి, మాజీ సర్పంచ్ అల్లి సైదులు, సుల్తాన్ యల్లయ్య తదితరులు ఉన్నారు.

మాల అమరవీరుల చిత్రపటాలకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ: పట్టణంలోని మాల మహానాడు కార్యాలయంలో సోమవారం మాల అమరవీరులు పానంగి శేషయ్య, గోపతోటి నారాయణ చిత్రపటాలకు మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి పాలపాటి సుమలత, రాయల మౌనిక, బోయిన్ల అరుణ ,బూరుగు అంజయ్య పాల్గొన్నారు.

సైకాలజిస్టులను నియమించాలని విన్నపం

నల్లగొండ: జిల్లాలోని విద్యా సంస్థల్లో సైకాలజిస్టులను నియమించాలని కోరుతు సోమవారం కలెక్టరేట్ ఏఓ మోతిలాల్‌కు తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోకల వెంకటేశ్వర్లు, అరుణ, శోభ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిళ్లకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. సైకాలజిస్టులను నియమించడం వల్ల విద్యార్థుల్లో సానుకూల దృక్పథం కలిగించి, భవిష్యత్‌పై ఆశలు పెంచేందుకు కృషి చేస్తారన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కట్టంగూర్ : గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ యాదగిరికి డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దపాటి సుధాకర్, మండల కార్యదర్శి గంట మల్లేష్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తిప్పర్తి : మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని తిప్పర్తి ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. సోమవారం తిప్పర్తి మండలంలోని సిలార్‌మియాగూడెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, ప్రారంభం కాని ఇళ్ల పనులను త్వరగా మొదలుపెట్టాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అరవింద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సిలార్‌మియాగూడెంలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుధాకర్

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న గూడూరు అంజిరెడ్డి

కట్టంగూర్ : విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మోటివేషనల్ స్పీకర్ గూడూరు అంజిరెడ్డి అన్నారు. సోమవారం కట్టంగూర్ మండలంలోని ఈదులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ నల్లగొండ స్టార్స్, ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా విద్యార్థులకు యువ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ విద్యార్థులు లక్ష్య సాధన కోసం నిరంతరం కృషిచేయాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు సంస్కారాన్ని పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ సభ్యుడు నవీన్ సహకారంతో యారాల ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు బెల్టులు, టైలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ ప్రవీణ్, లయన్స్ క్లబ్ సభ్యులు బండ నర్సిరెడ్డి, ఇంద్రకంటి ఇంద్రారెడ్డి, గండ్లు అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, నవీన్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అసమ్మతి వీడి అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న చలమల కృష్ణారెడ్డి

మర్రిగూడ : ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అసమ్మతిని వీడి మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చలమల కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పదవి కోసం మునుగోడుకు ఉప ఎన్నికలు తెప్పిస్తాననడం, రాజీనామా చేస్తానని రాజగోపాల్‌రెడ్డి పార్టీని బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. మునుగోడు ప్రజలకు, చర్లగూడ ప్రాజెక్టు ముంపు బాధితులకు ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయడానికి కృషిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మెండు నరసింహారెడ్డి, వెన్నమనేని సుధాకర్‌రావు, రంగారెడ్డి, నరసింహ, మాదగోని కృష్ణయ్య, బండి అనంతం, శ్రీనునాయక్, సిరిపంగి శ్రీనివాస్, కొట్టం శ్రీనివాస్, ఖదీర్, జీవన్, ఎండి.ఇబ్రహీం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేలో కలెక్టర్‌కు వినతి

కట్టంగూర్ : మండలంలోని బొల్లేపల్లి గ్రామ పంచాయతీ నుంచి పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ బొల్లేపల్లి గ్రామస్తులు సోమవారం నల్లగొండలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. బొల్లేపల్లి నుంచి చిన్న సూరారం, పెద్ద సూరారం, పెరిందేవిగూడెం, నల్లగొండ రోడ్డు వరకు ఉన్న రోడ్లన్నీ గుంతలమయంగా మారి ప్రమాదకరంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్, ఆటోల్లో వెళ్లినా గుంతల కారణంగా ఆలస్యమై ప్రజలు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో గాదగోని శ్రీనివాస్, జంజిరాల క్రాంతికుమార్, పి.భానుప్రసాద్, జి.ధనలక్ష్మి ఉన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలని..

కట్టంగూర్ మండలంలోని ఈదులూరు చెరువు కింద నీట మునిగిన పంటపొలాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఆ గ్రామ రైతులు సోమవారం నల్లగొండలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎర్రకుంట నుంచి రావికుంట వెళ్లే కాలువకు ముందస్తు హెచ్చరికలు లేకుండా నీటిని వదలడంతో పంట పొలాలు పూర్తిగా నీట మునిగిపోయాయని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు తూము తలుపులు తెరవడంతో సుమారు 16 ఎకరాల పంట పొలాలు నీట మునిగాయని వివరించారు. వ్యవసాయ మోటార్లు కూడా నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో రైతులు పెంటమల్ల అంజయ్య, గంట నర్సయ్య, గంట మల్లయ్య, సల్వాది పాపయ్య, పెంటమల్ల లక్ష్మయ్య, ఎరగబోయిన సత్యనారాయణ, బండ మల్లారెడ్డి ఉన్నారు.